136) లలిత

ప॥ సకలంబులు నీవే సర్వేశ్వర నాకు । అకలంకంబగుసుఖమే అన్నిట నిదే నాకు ॥

చ॥ పొందుగ జక్రాంకితమే భుజబల మిదె నాకు । అందినహరి నీచింతే ఆత్మబలము నాకు ।
సందడి బేరుబలము కేశవనామము నాకు । యిందును నందును భవభయ మిక లేదిదే నాకు ॥

చ॥ అంగపుదిరుమణు లివి పంచాంగబలము నాకు । సంగతి నీపై పాటలె స్వరబలి మిదే నాకు ।
రంగుగ నీగుణరాసులే రాసిబలము నాకు । యింగితముగ నిహపరముల కెదురేదిదే నాకు ॥

చ॥ కనుగొను నీవిగ్రహమే గ్రహబలి మిదె నాకు । విను నీదాసులసేవే వెనుబలి మిదె నాకు ।
తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు । ఘనమే చెప్పగ నింతట గలిగెబో యిదే నాకు ॥